డ్రగ్స్, నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట

రాచకొండ పరిధిలో ప్రత్యేక బృందాలు

సీపీ తరుణ్ జోషి

ఘట్‌కేసర్, మే 30: నూతన నేరన్యాయ చట్టాలు, డ్రగ్స్ కట్టడి, నకిలీ విత్తనాల సరఫరాను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏస్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం సీపీ తరుణ్ జోషి పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. డ్రగ్స్, నకిలీ విత్తనాల సరఫరా పట్ల పోలీసు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి, నివారించాలన్నారు. సరఫరా చేసే ముఠాలను గుర్తించి, పీడీ చట్టాన్ని ప్రయోగించాలన్నారు. ఎన్‌డీపీఎస్ చట్టం అమలు తీరు పట్ల దర్యాప్తు అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నూతన నేర న్యాయ చట్టాల ప్రకారం దర్యాప్తు విధానాలను పాటించాలన్నారు. రాచకొండ పరిధిలో ఇప్పటి వరకు ఎన్‌డీపీఎస్ చట్టం కింద 92 కేసులు నమోదు అయ్యాయని, 181 మందిని అరెస్టు చేసినట్లు సీపీ వివరించారు. జూలై 1వ తేదీ నుంచి భారత ప్రభుత్వ నూతన నేర న్యాయ చట్టాలు– 2023 అమల్లోకి రానున్నాయని, ఈ నేపథ్యంలో పలు కేసుల దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన నూతన విధానాలపై అధికారులు, సిబ్బంది సంపూర్ణ పరిజ్ఞానం, అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నకిలీ విత్తనాల సరఫరా, క్రయ విక్రయాలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన బృందాలు వ్యవసాయ అధికారులతో కలిసి పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా రిటైర్డు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాములు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యాదాద్రి డీసీపీ రాజేశ్ చంద్ర, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, ఎస్‌బీ డీసీపీ కరుణాకర్, అడ్మినిస్ట్రేషన్ డీసీపీ ఇందిరా, క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు, సైబర్ క్రైమ్ డీసీపీ చంద్రమోహన్, ఎస్‌ఓటీ డీసీపీ మురళీధర్, అదనపు డీసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌తో దురుసు ప్రవర్తన.. కేసు నమోదు

బంజారాహిల్స్, మే 30: బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ పట్ల దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని కమాండ్ కంట్రోల్ వద్దకు ఈ నెల 28న మధ్యాహ్నం ముగ్గురు వ్యక్తులు బైక్‌లపై వచ్చి తీవ్ర స్థాయిలో వాగ్వాదానికి దిగారు. సరిగ్గా గేటు ఎదుట బైక్‌లు ఆపి గొడవ చేయడంతో అక్కడే డ్యూటీ చేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ శ్రద్ధాంత్ మోహన్ అక్కడికి వచ్చాడు. గేటు ముందు నుంచి వెళ్లాలని, గొడవ ఆపాలని చెప్పాడు. దీంతో ఇద్దరు వ్యక్తులు ముందుకు వెళ్లిపోయారు. అయితే, బైక్‌పై వచ్చిన హబీబ్ హసన్ అనే వ్యక్తి మాత్రం అక్కడి నుంచి వెళ్లకపోగా.. తీవ్ర స్వరంతో గొడవకు దిగాడు. అతడి యాక్టివా బైక్‌పై పోలీస్ స్టిక్కర్ ఉండటంతో పాటు మద్యం మత్తులో ఉన్నట్లు కనిపించాడు. పెట్రోలింగ్ పోలీసులను పిలిపించి వారికి అప్పగించాడు. పోలీసులకు అప్పగిస్తావా.. అంతు చూస్తానంటూ హెచ్చరించడంతో ఈ మేరకు కానిస్టేబుల్ మోహన్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఐపీసీ 353, 186, 506తో పాటు 192 ఎంవీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తల్లి ఒడికి చేరేదెందరు.. ఎప్పుడు?

కొన్నారా..? కొట్టుకొచ్చారా..? ● పిల్లల విక్రయ ఘటనపై ముంబై పోలీసుల ఆరా

శిశువిహార్‌లో క్షేమంగా 14 మంది పసిపిల్లలు

ముఠా విక్రయించిన

మరో 46 మంది పిల్లల ఆచూకీ కోసం గాలింపు

సిటీబ్యూరో, మే 30 (నమస్తే తెలంగాణ): శిశు విహార్ సంరక్షణలో ఉన్న పసి పిల్లల్లో తల్లి ఒడికి చేరేదెందరు.. వారి తల్లిదండ్రులు ఎక్కడున్నారనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పసిపిల్లల విక్రయించే ముఠాను అరెస్టు చేసి, వారు విక్రయించిన 14 మంది పిల్లలను మేడిపల్లి పోలీసులు, మేడ్చల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీతో సమన్వయం చేసుకొని స్వాధీనం చేసుకున్నారు. పసిపిల్లల సంరక్షణ బాధ్యత శిశువిహార్ చూసుకుంటోంది. మేడిపల్లి పోలీసులు రెండు దఫాలుగా అరెస్టు చేసిన 11 మంది నిందితుల ముఠాకు సంబంధించిన మరికొంత మందిని విజయవాడలో గుర్తించారు. ఈ ముఠా ద్వారా ఇప్పటి వరకు 60 మంది పసి పిల్లలను విక్రయించినట్లు తేల్చారు. అందులో 14 మంది పిల్లలు ప్రస్తుతం శిశు విహార్ సంరక్షణలో ఉంటున్నారు. అసలైన తల్లిదండ్రుల నుంచి ఈ ముఠా కొంటుందా..? పిల్లలను కొట్టుకొస్తున్నారా..? అనే విషయంలో ఇప్పటి వరకు పోలీసులకు స్పష్టత లేదు.

ముంబై పోలీసుల ఆరా..

రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఏజెంట్లను పోలీసులు అరెస్టు చేశారు. అయితే, ఢిల్లీకి చెందిన కిరణ్, ప్రీతి, పుణెకు చెందిన కన్నయ్య ఈ ముఠాకు పిల్లలను సరఫరా చేస్తున్నట్లు అరెస్టయిన నిందితులు పోలీసులకు సమాచారమిచ్చారు. మేడ్చల్ పోలీసులు అరెస్టు చేసిన నిందితుల్లో ముదావత్ శారద అనే నిందితురాలిపై ముంబైలోని కంజుమార్గ్ ఠాణాలో పిల్లల అక్రమ రవాణాకు సంబంధించిన కేసు నమోదైంది. తాజాగా.. రాచకొండ పోలీసులు పసిపిల్లల విక్రయ ముఠాను అరెస్టు చేయడంతో ముంబై పోలీసులు వివరాలు అడిగారు. పిల్లలు మహారాష్ట్ర, ఢిల్లీ పరిసర ప్రాంతాల నుంచే ఎక్కువ సంఖ్యలో అక్రమ రవాణా అవుతుండటంతో పాటు ముంబైలో నమోదైన కేసులకు సంబంధించిన వివరాలను ఇరు పోలీసులు అడిగి తెలుసుకున్నారు.

కన్నవారెవరు..! కొన్నవారి పరిస్థితేంటీ..!

పసిపిల్లలు విక్రయిస్తున్న ముఠాకు సంబంధించిన మూలాల వరకు వెళ్తే కాని ఈ కేసుపై పోలీసులకు స్పష్టత వచ్చే అవకాశాలు లేవు. మూలాల వరకు వెళ్లాలంటే ఢిల్లీ, పుణెకు ప్రత్యేక బృందాలు వెళ్లాలి. అక్కడ నిందితుల కోసం గాలించాలి. పట్టుబడ్డ ఏజెంట్లతో ఎక్కడి నుంచి కొన్నారు.. ఎక్కడి నుంచి పిల్లలను కొట్టుకొచ్చారు.. (అపహరించారు) అనే విషయాలను తెలుసుకోవాల్సిన అవసరముంటుంది. అప్పుడే పిల్లల అసలైన తల్లిదండ్రులను గుర్తించేందుకు అవకాశముంటుంది. పిల్లల తల్లిదండ్రులు అక్కడ స్థానిక పోలీసు స్టేషన్లలో కిడ్నాప్, మిస్సింగ్ కేసులు పెట్టారా..? అనే విషయాలను కూడా ఆరా తీయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న 14 మంది పసిపిల్లల్లో 25 రోజుల నుంచి రెండున్నరేండ్ల పిల్లలే ఉన్నారు. ఇందులో 10 మంది ఆడపిల్లలు ఉండగా.. నలుగురు మగ పిల్లలున్నారు. ఈ ముఠా నుంచి నెల రోజుల కిందట పిల్లలను కొన్నవారున్నారు. అలాగే సంవత్సరం కిందట కూడా పిల్లలను కొన్నవారున్నారు. పిల్లలతో కొన్నవారికి మాతృబంధం పెరిగిపోయింది. దీంతోనే ఇటీవల పిల్లలను శిశువిహార్‌కు పోలీసులు అప్పగిస్తున్న సమయంలో కొన్న తల్లిదండ్రుల రోదన అరణ్యరోదనగా మారి అందరిని కలిచివేసింది. ఈ సమయంలో పోలీసుల ముందు పెద్ద సవాలు నెలకొంది. ఇప్పటి వరకు ఈ ముఠా 60 మంది పిల్లలను విక్రయించింది. అందులో మరో 46 మందిని గుర్తించి, ఆ పిల్లల తల్లిదండ్రులను కూడా గుర్తించాల్సి ఉంది.

ఈ కేసు ముందుకు సాగేనా..!

జూన్ 2న రాష్ట్ర వేడుకలు. 4న పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. మరోపక్క జూలై 1వ తేదీ నుంచి కొత్త చట్టాలు అమల్లోకి రానుండటంతో ఆయా చట్టాలపై పోలీసులకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాచకొండ పోలీసులు ఈ కేసును ముందుకు తీసుకెళ్తారా..? ఇక్కడికే మమా..అనిపిస్తారా..? అనే సందేహాలు సైతం వినిపిస్తున్నాయి. ఈ నెల 22న ఈ కేసులో ప్రధాన సూత్రదారులైన ముగ్గురిని అరెస్టు చేయగా, 28న మరో 8 మందిని అరెస్టు చేశారు. 10 రోజులవుతున్నా, ఢిల్లీ, మహారాష్ట్రకు వెళ్లి ప్రధాన ఏజెంట్లను గుర్తించలేకపోవడం గమనార్హం.

శిశువిహార్‌లో ఆరోగ్యంగా పిల్లలు

శిశువిహార్ ఆధీనంలో ఉన్న 14 మంది పిల్లలు ఆరోగ్యంగా ఉన్నారు. 25 రోజుల పిల్లల నుంచి రెండున్నరేండ్ల వయస్సున్న వారు ఇప్పుడు శిశు విహార్‌లో ఉన్నారు. పోలీసుల దర్యాప్తు కొనసాగుతున్నది. దర్యాప్తు అనంతరం పిల్లల క్రయ విక్రయాలకు సంబంధించిన వివరాలతో పాటు వారి తల్లిదండ్రులకు సంబంధించిన పలు అంశాలపై స్పష్టత వస్తుంది. కేసు దర్యాప్తులో వెల్లడయ్యే అంశాలు, పిల్లల తల్లిదండ్రులను గుర్తించిన తరువాత స్థానికంగా ఏమైనా కేసులున్నాయా అనే విషయాలు తేలనున్నాయి. అంతర్రాష్ట్ర వ్యవహారాలు కూడా ఇందులో ఉన్నాయి. పిల్లల దత్తత అంశం చట్ట ప్రకారం నడువాలి.. కొనుగోలు చేసి పెంచుకున్న తల్లిదండ్రులకు పిల్లలను అప్పగించడం కుదరదు.. అది చట్టవిరుద్ధం.

- ఎ.ఎం.రాజారెడ్డి, మేడ్చల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్

మహారాష్ట్ర కేంద్రంగా డ్రగ్స్ సరఫరా

రాజేంద్రనగర్‌లో యువతీ యువకుడి అరెస్టు

రూ. 20లక్షల విలువైన ఎండీఎంఏ సీజ్

బండ్లగూడ, మే 30: మహారాష్ట్ర కేంద్రంగా కొరియర్ ద్వారా నగరానికి డ్రగ్స్ తెప్పించుకుని ఐటీ, రేవ్ పార్టీ వంటి ఈవెంట్లకు సరఫరా చేస్తున్న యువతీ యువకుడిని శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.20 లక్షల విలువ చేసే 270 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ ఆబ్కారీ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన తృప్తి ప్రభాకర్ హోకం (21), మధ్యప్రదేశ్‌కు చెందిన అనుభవ్ సక్సేనా (24)కు స్వరాష్ట్రంలోని చంద్రపూర్‌కు చెందిన సాబేర్ అనే డ్రగ్స్ వ్యాపారితో పరిచయాలున్నాయి. నగరంలో ప్రైవేటు ఉద్యోగాలు చేసేందుకు వచ్చిన యువతీ యువకుడు సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో డ్రగ్స్ వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే తమకు పరిచయమున్న ఐటీ ఉద్యోగులు, ఈవెంట్ నిర్వాహకులకు కొంత కాలంగా డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. అయితే, నేరుగా వెళ్లి డ్రగ్స్ తీసుకువస్తే పోలీసులు పట్టుకుంటారని, కొరియర్ ద్వారా మహారాష్ట్ర నుంచి డ్రగ్స్ తెప్పించుకుని, యథేచ్ఛగా నగరంలో విక్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే మహారాష్ట్ర చంద్రపూర్ నుంచి సాబేర్ నగరంలో ఉంటున్న తృప్తి, అనుభవ్‌కు కొరియర్ ద్వారా ఎండీఎంఏను పంపించాడు. వచ్చిన డ్రగ్స్‌ను విక్రయించేందుకు గురువారం ఉదయం తృప్తి, అనుభవ్‌లు కలిసి బండ్లగూడ జాగీర్, సన్ సిటీలోని మోర్ సూపర్ మార్కెట్ వద్దకు ఆటోలో వచ్చి అనుమానాస్పదంగా తచ్చాడుతున్నారు. అప్పటికే సమాచారం అందుకున్న ఆబ్కారీ అధికారులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా.. డ్రగ్స్ వ్యవహారం బయటపడింది. ఈ మేరకు నిందితులిద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.20 లక్షల విలువైన 270 గ్రాముల ఎండీఎంఏతో పాటు రెండు సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

బైక్‌రేసింగ్‌లు.. యువకులపై కేసులు

సిటీబ్యూరో: బైక్ రేసింగ్‌కు పాల్పడుతున్న యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని.. 8 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కొందరు యువకులు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ రోడ్లపై రాత్రి వేళ బైక్‌రేసింగ్‌లకు పాల్పడుతూ ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. సైలెన్సర్లను తొలగించడంతో పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ కేబీఆర్ పార్క్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వరకు రోడ్లపై స్వైర విహారం చేస్తున్నారు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు.. గురువారం రాత్రి ఆ యువకులను పట్టుకొని.. కేసులు నమోదు చేశారు.

వివరణ ఇవ్వకుంటే ఆయుధాల లైసెన్స్ రద్దు

సిటీబ్యూరో, మే 30 (నమస్తే తెలంగాణ): మల్కాజిగిరి జోన్ పరిధిలో ఇప్పటి వరకు రెన్యూవల్ చేసుకోని ఆయుధాల లైసెన్స్‌లు ఎందుకు రద్దు చేయకూడదో తెలుపాలని రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. లైసెన్స్ సమయం ముగిసిన తరువాత షో కాజ్ నోటీసులు కూడా ఇచ్చామని, అయినా రెన్యూవల్ చేసుకోలేదన్నారు. 30 రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేదంటే లైసెన్స్‌లు రద్దవుతాయని వెల్లడించారు. మల్కాజిగిరి జోన్‌లోని జవహర్‌నగర్ ఠాణా పరిధిలోని 42 మంది పేర్లను వెల్లడించారు.

ఇంటర్ పరీక్ష రాస్తూ..

వెంగళరావునగర్, మే 30: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలో మరొకరి పరీక్ష రాస్తూ డిగ్రీ విద్యార్థి దొరికిపోయాడు. ఎస్ఆర్ నగర్ పీఎస్ ఎస్సై శ్రావణ్ కథనం ప్రకారం.. శ్రీ చైతన్య జూనియర్ కళాశాలకు చెందిన పల్లపోగు వైభవ్ (19) బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం కామర్స్ పరీక్ష రాయాల్సి ఉంది. ఎస్ఆర్ నగర్‌లోని అవినాశ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో సెంటర్‌ను కేటాయించారు. అయితే, వైభవ్‌కు బదులుగా అవినాశ్ డిగ్రీ కళాశాలకు చెందిన సంజీవ్(20) పరీక్షకు హాజరయ్యాడు. పరీక్షా కేంద్రం రూమ్ నం.304లో సంజీవ్ పరీక్ష రాస్తుండగా.. ఇన్విజిలేటర్ మాధవీలత అనుమానంతో హాల్‌టికెట్‌ను పరిశీలించారు. వైభవ్‌కు బదులు సంజీవ్ పరీక్ష రాస్తున్నట్లు గుర్తించారు. వెంటనే పరీక్షా కేంద్రమైన అవినాశ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ ప్రిన్సిపాల్ స్వప్నకు ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు ఎస్ఆర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్కింగ్ స్థలం నుంచి లారీ చోరీ

ఘట్‌కేసర్, మే 30: పార్కింగ్ చేసిన లారీని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని చౌదరిగూడ రైస్‌మిల్ వద్ద ఈ నెల 21న జరిగింది. బాధితుడు ఈ నెల 29న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ యుగేంధర్ గౌడ్ కథనం ప్రకారం.. చౌదరిగూడలోని రైస్‌మిల్ వద్ద ప్రతిరోజూ లారీ పార్కు చేసి ఇంటికి వెళ్తాడు. ఈ నెల 20 పార్కింగ్ స్థలంలో లారీని పెట్టి, ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు చూడగా లారీ కనిపించలేదు. దీంతో ఆ లారీ డ్రైవర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చంపేశారా..? చనిపోయాడా?

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి..

కుత్బుల్లాపూర్, మే 30: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. అయితే, ఆ యువకుడు మద్యం మత్తులో బిల్డింగ్ పైనుంచి కింద పడి చనిపోయాడా..! బీహర్‌కు చెందిన తోటి కార్మికులతో ఏదైనా గొడవ జరిగి తోపులాటలో కింద పడిపోయాడా..! అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మృతుడి కుటుంబసభ్యులు మాత్రం.. దాడిచేసి కొట్టి చంపారని ఆరోపిస్తున్నారు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. దూలపల్లిలోని కృష్ణానగర్‌లో ఉంటున్న రేగడి సింహాచలం, పార్వతి దంపతులు. వీరు కొడుకు, కూతురితో కలిసి నివాసముంటున్నారు. కుమారుడు రేగడి రాము (26) దూలపల్లి పారిశ్రామికవాడలోని రాయల్ అగ్రిలైఫ్ సెన్సెస్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఇంటి నుంచి కంపెనీకి రోజూ నడుచుకుంటూ వచ్చిపోవాలంటే ఇబ్బంది కలుగడంతో.. అదే ప్రాంతంలో వర్కర్ల కోసం కంపెనీ అద్దెకు తీసుకున్న భవనం మొదటి అంతస్తులో బీహర్‌కు చెందిన కార్మికులతో కలిసి మూడు నెలలుగా ఉంటున్నాడు. ఈ నెల 26న ఆదివారం రాత్రి రాము గదిలో ఉంటున్న ఇద్దరితో పాటు అదే ప్రాంతంలో ఉన్న మరో నలుగురు కార్మికులు కలిసి కలిసి మద్యం సేవించారు. ఆ తర్వాత బిల్డింగ్‌పై పడుకొని ఫోన్ మాట్లాడుతూ పక్కన ఉన్న రేకుల షెడ్డుపై పడిపోయాడు. తీవ్రగాయాలైన అతడిని చికిత్స కోసం మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 29న రాత్రి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని గాంధీ వైద్యశాలకు తరలించి, దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఇద్దరి మృతదేహాలు లభ్యం

మృతుల్లో ముగ్గురు జగద్గిరిగుట్ట వాసులే.. ఒకరిది ఈసీఐఎల్

జగద్గిరిగుట్ట, మే 30: ఆంధ్రప్రదేశ్ బాపట్ల నల్లమడ వాగు ఘటనలో మరో ఇద్దరి మృతదేహాలు గురువారం లభ్యమయ్యాయి. నలుగురు చనిపోగా ఇందులో ముగ్గురు జగద్గిరిగుట్ట వాసులు కాగా.. మరొకరు ఈసీఐఎల్ వాసిగా గుర్తించారు. ఈనెల 26న హైదరాబాద్ నుంచి 12 మంది ఆంధ్రప్రదేశ్‌లోని బంధువులను కలిసేందుకు వ్యాన్‌లో వెళ్లారు. ఈ నేపథ్యంలో బుధవారం బాపట్ల సమీపంలోని నల్లమడ వాగు ప్రవాహంలో నలుగురు గల్లంతయ్యారు. తొలుత అనూప్ రాజ్ అలియాస్ సన్నీ (13) నీటిలో కొట్టుకుపోతుండగా రక్షించేందుకు వెళ్లిన అతడి తండ్రి దారబాడి సునీల్‌కుమార్ (35) సైతం మునిగిపోయాడు. గాలించగా వారిద్దరి మృతదేహాలు అదే రోజు లభ్యమయ్యాయి. ఇదే ఘటనలో జగద్గిరిగుట్ట నివాసి బండ నందు (35), ఈసీఐఎల్‌కు చెందిన వడ్లకండ కిరణ్‌కుమార్ (30) కూడా గల్లంతు కాగా.. గురువారం వారి మృతదేహాలను వెలికితీశారు. సముద్రం పోటు ఉన్న కాలువలో ప్రవాహం, సుడిగుండాలు తెలియక స్నానానికి దిగడంతో ఈ ప్రమాదం జరిగింది. ఒకరిని రక్షించే క్రమంలో మరో ముగ్గురు నీట మునిగారు. ఈ ప్రమాద ఘటన సామాజిక మాధ్యమాల్లో ప్రసారం కావడంతో జగద్గిరిగుట్టలో చర్చనీయాంశమైంది. బాపట్లకు చెందిన సునీల్ కుమార్ జగద్గిరిగుట్ట నివాసి కోటేశ్వరిని వివాహం చేసుకుని హైదరాబాద్‌లో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేశాడు. ఈ ప్రమాదంలో కోటేశ్వరి భర్త, కుమారుడితోపాటు సోదరుడు కిరణ్‌కుమార్, మేనమామ బండ నందు చనిపోవడంతో ఆ రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది.

ఏది చెప్పినా నమ్మేసి..

పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో ఎర..

ట్రేడింగ్ పేరుతో రూ.18 లక్షలు

మోసం చేసిన సైబర్ చీటర్స్

సిటీబ్యూరో, మే 30 (నమస్తే తెలంగాణ): తమది డిజిటల్ మార్కెటింగ్ కంపెనీ అని.. అందులో పార్ట్‌టైమ్ ఉద్యోగం ఉన్నదని, కేవలం హోటల్స్, రెస్టారెంట్స్ రివ్యూస్ రాస్తే వేల రూపాయలు సంపాదించవచ్చంటూ నమ్మించిన సైబర్ నేరగాళ్లు ఒక ప్రైవేట్ ఉద్యోగి నుంచి రూ. 18 లక్షలు కాజేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన ఒక యువకుడికి వాట్సాప్‌లో 'కైన్ డీసీఎక్స్ ఎక్స్ఛాంజ్ డిజిటల్ మార్కెటింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ ఇండియా' సంస్థ పేరుతో ఓ మెసేజ్ వచ్చింది. పార్ట్‌టైమ్ ఉద్యోగం మీ కోసం ఉన్నదని, కేవలం రివ్యూస్ రాస్తే సరిపోతుందని, మీ వివరాలు పంపితే వర్క్ ప్రారంభించవచ్చని ఆ మెసేజ్‌లో సూచించారు. నిజమని నమ్మిన బాధితుడు పేటీఎం, గూగుల్, ఫోన్ పే వివరాలు పంపించాడు. కొన్ని రివ్యూస్ రాసి, వాటిని స్క్రీన్ షాట్ చేసి పంపించాలని నేరగాళ్లు సూచించారు. రివ్యూస్ రాసిన నిమిషాల వ్యవధిలోనే బాధితుడి బ్యాంకు ఖాతాలోకి సైబర్‌నేరగాళ్లు నగదు పంపించారు. ఆ తరువాత ఒక వర్క్ గ్రూప్‌లో చేరాలని లింక్ పంపించారు. అందులో చేరగానే ట్రేడింగ్ చేస్తే లాభాలొస్తాయని, టాస్క్‌లు పూర్తి చేస్తే 30 నుంచి 40 శాతం లాభాలొస్తాయని సూచించారు. ఒకపక్క గూగుల్ రివ్యూస్ టాస్క్ పూర్తి చేస్తుండగా, కాయిన్ డీఎస్ఎక్స్ ట్రేడింగ్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టమంటూ సూచించారు. 20 నిమిషాల లోపే మీకు లాభాలు వస్తాయని బాధితుడిని నమ్మించారు. వారి మాటలు నమ్మిన బాధితుడు రూ.18.70 లక్షలు పెట్టుబడిగా పెట్టాడు. ఆ తరువాత బాధితుడికి స్క్రీన్‌పై భారీ లాభాలు కనిపించాయి. వాటిని విత్ డ్రా చేసుకోవాలంటే.. మీరు వీఐపీ గ్రూప్‌లో చేరాలి.. అందులో చాలా లాభాలొస్తాయంటూ ఒప్పించే ప్రయత్నం చేశారు. ఇప్పటి వరకు పెట్టిన పెట్టుబడి వెనక్కి తీసుకునే అవకాశం లేకపోవడంతో ఇదంతా మోసమని బాధితుడు గుర్తించి సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కేసుల పేరుతో బెదిరింపులు

50 వేలు డిమాండ్ చేసిన సైబర్ నేరగాళ్లు

బంజారాహిల్స్, మే 30: 'మీ పేరుతో ఢిల్లీ నుంచి మలేషియాకు డ్రగ్స్ రవాణా చేస్తున్నారంటూ..' ఓ యువతిని బెదిరించిన సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేశారు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం. 2లోని జ్యోతి నెస్ట్‌లో నివాసముంటున్న చైతన్య కీర్తి అనే యువతికి ఈ నెల 27న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. తాము ఫెడెక్స్ కొరియర్ నుంచి కాల్ చేస్తున్నామని, తమ సంస్థ ద్వారా మీ పేరుతో పార్సిల్ ఢిల్లీ నుంచి మలేషియాకు వెళ్తోందన్నారు. పార్సిల్‌లో డ్రగ్స్, బోగస్ పాస్‌పోర్టులు, ఏటీఎం కార్డులు ఉన్నాయంటూ దబాయించారు. తాను ఎలాంటి పార్సల్‌ను పంపలేదని చైతన్య కీర్తి చెప్పినా వినిపించకపోగా.. సీబీఐ అధికారితో మాట్లాడాలంటూ ఓ వ్యక్తితో మాట్లాడించారు. సీబీఐ అధికారిలా మాట్లాడిన వ్యక్తి మాట్లాడుతూ.. మీపైన ఏవైనా కేసులు ఉన్నాయేమో చూసుకోమంటూ ఓ వెబ్‌సైట్ లింక్‌ను పంపించాడు. లింక్‌లో చూడగా బాధితురాలిపైన మనీ లాండరింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్ కేసులు ఉన్నట్లు కనిపించింది. వెంటనే తాము సూచించిన అకౌంట్‌కు రూ.50 వేలు పంపించి కేసును క్లోజ్ చేసుకోవాలంటూ ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో బాధితురాలు వారు చెప్పిన అకౌంట్‌కు రూ.50 వేలు పంపించింది. ఈ విషయంపై కుటుంబ సభ్యులతో చర్చించగా.. సైబర్ మోసగాళ్లు ఈ విధంగానే డబ్బులు దోచేస్తున్నారని తెలిపారు. గురువారం బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఐపీసీ 419, 420తో పాటు ఐటీ యాక్ట్ 66(సీ), 66 (డీ) కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఒక్కో టాస్క్‌కు 1300 ఇస్తామంటూ..

బంజారాహిల్స్, మే 30: ఇంటిలోనే ఉండి ఉద్యోగం చేస్తూ డబ్బులు సంపాదించవచ్చంటూ ఓ మహిళను నమ్మించి బురిడీ కొట్టించిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీకృష్ణానగర్‌కు చెందిన గృహిణి సయ్యద్ జనాబ్ బషారత్‌కు ఈ నెల 20న గుర్తు తెలియని వ్యక్తి నుంచి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. ఇంట్లో ఉంటూనే ఆన్‌లైన్ ద్వారా డబ్బులు సంపాదించవచ్చంటూ వచ్చిన ఆ మెసేజ్‌ను నమ్మిన బషారత్.. వారు చెప్పిన విధంగా వివరాలు నమోదు చేసింది. రూ.1,000 పంపించి తాము చెప్పిన టాస్క్‌లు పూర్తి చేస్తే 1,300 ఇస్తామంటూ, రోజుకు కొంత మొత్తం పెరుగుతూ ఉంటుందని నమ్మించారు. దీంతో పలు దఫాలుగా టాస్క్‌ల పేరుతో డబ్బులు పంపించారు. సైబర్ నేరగాళ్ల మాటలను నమ్మించి బషారత్ మొత్తం రూ. 97 వేలు పంపించిన తర్వాత నంబర్‌ను బ్లాక్ చేశారు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు గురువారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PEST CONTROL

★చెదలు, బొద్దింకలు నివారణ. న్యూ కన్‌స్ట్రక్షన్ ట్రీట్‌మెంట్ 10 సంవత్సరాల గ్యారెంటీ మరియు శానిటైజర్ స్ప్రే కొరకు సంప్ర: 9392468282, 8333030227. NT-334110

PACKERS & MOVERS

★Sri Sai Packers & Movers Local and all over India, Resonable Price. Head Office Nacharam: 27176927, Ameerpet: 9866379391, DSNR: 9666993927, KKP: 9949513929, MP: 9848263927, ECIL: 9666983927. NT-334207

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్